క్లుప్తంగా

పీఎంశ్రీ పథకానికి పాఠశాల ఎంపిక

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల శనివారం పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి ఎంపికైంది. ఈ పథకం కింద జిల్లాలో మొత్తం 20 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక కాగా, వాటిలో నారంవారిగూడెం పాఠశాలకు స్థానం దక్కడం విశేషం. ఎంపిక కావడంపై హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎంఈఓ పి.కృష్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ మనుగొండ వెంకటముత్యం, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.రమేష్, ఉపాధ్యాయులు సీహెచ్.అప్పారావు, బి.శ్రీనివాసరెడ్డి, కె.హరినాథ్‌బాబు, కె.రామారావు, బి.రమేష్, ఎస్.బుల్లెమ్మ, జి.సుజాత, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చెక్కుల పంపిణీ

బూర్గంపాడు: అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరి వైద్యసేవలను పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అందించారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన రాఘవరెడ్డికి, నాగినేనిప్రోలు గ్రామానికి చెందిన వాస్తవికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె అందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, ఉపసర్పంచ్ యడమకంటి ఝాన్సీలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడగం శ్రీనివాసరెడ్డి, రెడ్డెం రామకృష్ణారెడ్డి, సుధాకర్, శివారెడ్డి పాల్గొన్నారు.

మే 5న చలో భద్రాచలం

దుమ్ముగూడెం: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మే 5వ తేదీన నిర్వహించే చలో భద్రాచలం కార్యక్రమానికి వేలాదిగా ఆదివాసీలు తరలిరావాలని టీఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెద్ద బండిరేవు, పెద్ద నల్లబెల్లి, గడ్డర్ గట్టు గ్రామల్లో జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించి చలో భద్రాచలం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పుల్లయ్య పాల్గొని మాట్లాడుతూ.. మే నెల 3, 4 తేదీల్లో భద్రాచలం పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివాసీ సంస్కృతిక ఉత్సవాలు, 5న బహిరంగ సభ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వాగే ఖాదర్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోయం వీర్రాజు, గిరిజన సంఘం నాయకులు పాయం రాంబాబు, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు సోయం సుశీల, సోయం నరసింహారావు, పాయం హరిబాబు, సారయ్య, ఆపక్క బాబు పాల్గొన్నారు.

కేంద్ర కమిటీకి వినతి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ కంపెనీలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ పరిష్కారానికి యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందం అమలు చేయించాలని కోరుతూ శనివారం మణుగూరు ఏరియాకు వచ్చిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డికి మణుగూరు ఏరియా ఆపరేటర్స్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్స్ అసోసియేషన్ నాయకుడు నాజర్‌పాషా మాట్లాడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు, అబ్దుల్ రవూఫ్. డి.వీరభద్రయ్య, కాపా శివాజీ, వెంకటేశ్వరరెడ్డి, ఎం.రమేష్‌బాబు, గట్టయ్య, ఆపరేటర్లు అశోక్, కుమారస్వామి, గంగయ్య, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, జానీ, కృష్ణారావు, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, శంకరాచారి, లక్ష్మీనారాయణ, రవి, హుస్సేన్ లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ములకలపల్లి: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ సంఘాల మండల నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘాల మండల జనరల్‌బాడీ సమావేశంలో ఆయా కమిటీల జిల్లా కార్యదర్శులు కల్లూరి కిషోర్, అమర్లపూడి రాము నూతన కమిటీలను ప్రకటించారు. అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం మండల అధ్యక్షుడిగా వెలకం చలమయ్య, ప్రధాన కార్యదర్శిగా యర్రగొర్ల రామారావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడిగా కొర్సా గణపతి, ప్రధాన కార్యదర్శిగా ఛాత్రబోయిన వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ప్రజాపంథా జిల్లా కార్యవర్గ సభ్యులు నూపా భాస్కర్. డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్, ప్రజాపంథా మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, ఎంపీటీసీలు నూపా సరోజిని, మడకం విజయ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న ఆర్లగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ సంఘాల మండల కమిటీలను జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేశారు. ప్రగతిశీల రైతు సంఘం కార్యదర్శిగా మీడియం శంకర్, అధ్యక్షుడిగా కల్లూరు శంకర్, కమిటీ సభ్యులు కొరసా రామలక్ష్మి, కొమరం బాబు కన్నయ్య, కారం శ్రీను, నారాయణ, ప్రగతిశీల కార్మిక సంఘం కార్యదర్శిగా నూపా అర్జున్, అధ్యక్షుడిగా కొరసా రాంశెట్టి, కమిటీ సభ్యులుగా కోసం వీరన్న, మర్మ మారయ్య, సరే వీరన్న, మద్దరాజు, గంగరాజులను ఎంపిక చేశారు. మండల కార్యదర్శి సాయన్న, వీరభద్రం, లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

75 ఏళ్ల పేపర్ బాయ్!

- 30 సంవత్సరాలుగా సైకిల్‌పై సవారీ
- మరోవైపు ఎన్డీ పార్టీలో జిల్లా నాయకుడిగా గుర్తింపు..
- అనారోగ్యానికి, ఆస్తులకు దూరంగా జీవనం



ఎన్డీ పార్టీకి సంబంధించి ఓ సమావేశంలో మాట్లాడుతూ..



పేపర్‌బాయ్‌గా సైకిల్‌పై వెళ్తున్న పున్నంచంద్

సండే స్పెషల్

బూర్గంపాడు: ఆయనో విప్లవ పార్టీకి చెందిన జిల్లా నాయకుడు. ప్రజా సమస్యలు ఎక్కడుంటే ఆయన అక్కడుంటాడు. పేదల కోసం అనునిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటాడు. సమస్యలు పరిష్కారమైనా కాకున్నా తనవంతుగా పేదలకు మద్దతుగా నిలుస్తాడు. మరోవైపు తెల్లవారుజామున వివిధ దినపత్రికలను సైకిల్‌పై తీసుకుని పేపర్ బాయ్‌గా దర్శనమిస్తాడు. ఆయనే బూర్గంపాడుకు చెందిన సీనియర్ సిటిజన్ ధన్సీరాం పున్నంచంద్. బూర్గంపాడు మండలంలో ఆయన తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. భద్రాచలం, పాల్వంచ డివిజన్‌లలో చాలామందికి ఆయన సుపరిచితులు.

75 ఏళ్ల వయసున్న పున్నం చందర్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా జీవితంలో మమేకమవుతూనే గత మూప్పై ఏళ్లుగా వివిధ దినపత్రికలకు పేపర్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన ఆయన ప్రచార మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకునేందుకు కృషి చేస్తున్నాడు.75 ఏళ్ల వయసులో రోజు తెల్లవారు జామున 4.30గంటలకే తన సైకిల్‌పై బూర్గంపాడు బస్టాండ్‌కు వచ్చి పేపర్ పార్శిల్స్ తీసుకుని సైకిల్‌పై పెట్టుకుని బయలుదేరుతాడు. అందరికీ గుడ్‌మార్నింగ్ చెప్పుకుంటూ.. చిన్న, పెద్దలను అప్యాయంగా పలకరిస్తూ.. ఇళ్లకు, ప్రభుత్వ కార్యాలయాలకు దినపత్రికలను వేస్తుంటాడు.

రోగాలు బహుదూరం..

ఏడు పదుల వయసుమీదపడినా.. ఇప్పటికీ ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు వంటి సమస్యలు దరిచేరలేదు. కరోనా కష్టకాలంలో కూడా ఆయన తన సైకిల్‌పై తిరుగుతూ ప్రజలందరిని అప్రమత్తం చేశారు. మిత ఆహారంతో సైకిల్ సవారీనే తన ఆరోగ్య రహస్యమంటుంటాడు పున్నంచందర్.

ప్రజాసమస్యలపై గళమెత్తే నాయకుడిగా..

పున్నంచందర్ ఓ పేపర్‌బాయ్ మాత్రమే కాదు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కూడా. 50 ఏళ్లకు పైగా విప్లవ పార్టీలలో పనిచేస్తూ.. పేద ప్రజలకు అండగా నిలిచారు. అనేక విప్లవోద్యమాలలో కీలకంగా పనిచేశారు. అణగారిన అట్టడుగు వర్గాలకు న్యాయం చేసేందుకు నిరంతరం వారికి మద్దతుగా పోరాడుతుంటాడు. మారుమూల గ్రామాల్లోని ప్రజల స్థితిగతులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఆయన అనేక ఉద్యమాలు చేపట్టారు. ప్రజలతో పాటుగా ప్రభుత్వ సిబ్బంది ఇబ్బందులపై కూడా ఆయన పోరాడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే మహిళ సిబ్బంది టాయిలెట్ లేకపోవటంతో పడుతున్న ఇబ్బందులపై ఆయన పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. బూర్గంపాడు, సారపాక ప్రధానకూడళ్లలో సులభ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని ఆయన ఇప్పటికీ పోరాడుతునే ఉన్నారు. సామాజిక కార్యకర్తగా ఏ సమస్య ఉన్న దానిని సాధ్యమైనంత వరకు పరిష్కరించే దిశగా ఆయన పోరాటాలు కొనసాగిస్తారు. ఆయన విప్లవ పార్టీ నాయకుడిగానే కాకుండా కొంతకాలం జర్నలిస్టుగా సేవలను అందించారు. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై దృష్టి పెట్టి ఆయన అనేక కథనాలు రాశారు. ప్రస్తుతం ప్రజల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తున్నారు. ఎవరి నుంచి రూపాయి ఆశించకుండా ప్రజా జీవితంలో రాణిస్తున్న అరుదైన వ్యక్తులలో పున్నంచంద్ ఒకరు.

మితాహారం.. సైకిల్‌పై ప్రయాణం..

50 ఏళ్లుగా నా ప్రయాణం సైకిల్‌పైనే కొనసాగుతోంది. మితాహారం.. సైకిల్‌పై ప్రయాణమే నా ఆరోగ్య రహస్యం. ఇప్పటికి ఎలాంటి నొప్పులూ, బాధలు లేవు. బీపీ, షుగర్ లేకుండా ఆరోగ్యవంతమైన జీవనం సాగిస్తున్నాను. వామపక్ష భావాలకు ఆకర్షితుడినై ఎర్రజెండా ఎత్తుకుని 75ఏళ్ల జీవితంలో ఏనాడు లాభాపేక్ష లేకుండా ప్రజలకు నావంతు సేవలను అందించాను. నాకంటూ ఇల్లు కూడా లేదు. బంధువుల ఇంట్లోనే ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నాను.

– పున్నంచంద్

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



తిప్పాపురంలో రైతు డిక్లరేషన్ కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

చర్ల: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య శనివారం మండలంలోని మారుమూల గ్రామాల్లో పర్యటించారు. తిప్పాపురం, పెదమిడిసిలేరు, చినమిడిసిలేరు, సత్యనారాయణపురం గ్రామాల్లో పర్యటించి సమావేశాల్లో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను ప్రతీ ఇంటికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు సోడి చలపతిరావు, ఎంపీటీసీ సభ్యులు ముత్యాల స్వాతి, మడకం పద్మజ నాయకులు చీమకుర్తి వీరభద్రం, మేడిచర్ల వీరకుమార్, గూడపాటి సతీష్‌కుమార్, కె విజయకుమార్‌నాయుడు, కారంపూడి సాల్మన్ రాజు, అలవాల బాలు తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

దుమ్ముగూడెం: మండల అభివృద్ధి కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేతుల మీదుగా శనివారం చెక్కులు పంపిణీ చేశారు. 56 మంది లబ్ధిదారులకు గాను రూ. 56లక్షల 06వేల 496 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి దరఖాస్తులను వెంటనే స్క్రూటినీ చేసి తన ఆమోదనికి పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మి, తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీఓ ముత్యాలరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లంక శ్రీనివాస్ రావు, పిలక వెంకటరమణారెడ్డి, సోడి చలపతి, కనుబుద్ది దేవ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నూతన ఎంపీడీవోగా గొట్టిపర్తి శ్రీనివాసరావు శనివారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోల బదిలీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా అనంతగిరిలో ఎంపీడీవోగా చేస్తూ, లాంగ్ లీవ్‌లో ఉన్న శ్రీనివాసరాను స్థానిక ఎంపీడీఓగా జిల్లా కలెక్టర్ నియామించిన సంగతి తెలిసిందే. దాంతో ఆయన ఇక్కడ ఎంపీడీవోగా విధుల్లో చేరారు. కాగా సుమారు ఇరవై ఏళ్ల క్రితం శ్రీనివాసరావు తండ్రి కృష్ణారావు ఇదే కార్యాలయంలో వీడీఓగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం. బాధ్యతల స్వీకరించిన అనంతరం ఉపాధి హామి, కింది స్థాయి సిబ్బందితో ఎంపీడీఓ సమావేశం అయ్యారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీఓ

దమ్మపేట: అశ్వారావుపేట నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపర్తి శ్రీనివాసరావు శనివారం స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీడీఓకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గొట్టిపర్తి రఘానందం, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

అశ్వారావుపేటరూరల్: ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం తక్షణమే సౌకర్యాలు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి, ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొత్త కావడిగుండ్ల గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించి, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, వైద్య కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. పార్టీ నాయకులు జెట్టి బుచ్చయ్య, కంగాల వెంకయ్య, కొమరం భీమరాజు, జెట్టి గంగమ్మ, సావిత్రి, చిన్న లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్ ప్రాంతం టేకుచెట్ల భజార్‌కు చెందిన డ్రైవర్ మర్రి సురేష్(40) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు గురిజాల గోపి వారి గృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుడి దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలను కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగా అందజేశారు. పాపారావు, మనోజ్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం తేలికపాటి, మోస్తారు వర్షాలు పడ్డాయి. అన్నపురెడ్డిపల్లి, పెంట్లం, బుచ్చన్నగూడెం, మర్రిగూడెం, అబ్బుగూడెం గ్రామాల్లో మోస్తారు వర్షం కురవగా.. రైతుల పంటకు నష్టం వాటిల్లింది. రైతులు పంటలను రక్షించుకోవడానికి ఏంచేయాలో తెలియక నానా తంటాలు పడ్డారు. కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యంపై, పరుగులు పెడుతూ టార్పాలిన్ పట్టాలు కప్పారు. కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోగా, నీటిని తొలగించే ప్రక్రియను చేపట్టారు. మరో మూడు రోజుల పాటు అకాల వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బుచ్చన్నగూడెంలో ధాన్యం పట్టాలపై నిలిచిన నీటిని పారబోస్తున్న రైతులు

ఆక్రమణకు యత్నం

దమ్మపేట: నల్లకుంట గ్రామ శివారులో గల మిద్దినబుచ్చన్న కుంట చెరువు కట్టకు సరిహద్దులో ఉన్న రైతు.. శుక్రవారం జేసీబీతో కట్టను తవ్వించి, తన పోలంలో కలుపుకోవడానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రశ్నించగా.. ఆ రైతు జేసీబీతో సహా వెళ్లిపోయాడు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు సదరు వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కేసు నమోదు

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాకలో ఈనెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంపై అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. మణుగూరుకు చెందిన వరిపల్లి సతీష్ బైక్‌పై భార్య, కుమారుడుతో భద్రాచలం వెళ్తుండగా అశ్వాపురం మండలం చింతిర్యాల కాలనీకి చెందిన వల్లెపోగు రాజేష్ బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రాజేష్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని సతీష్ శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తునికాకు కట్టధర రూ.3.01

ములకలపల్లి: 50 తునికాకులతో చేసిన ఒక కట్టధర రూ.3.01గా నిర్ధారణ అయినట్లు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తునికాకు కాంట్రాక్టర్లకు, ప్రజాపంథా నాయకులకు శనివారం జరిగిన చర్చల్లో రేటు ఖరారు చేసినట్లు తెలిపారు. గత ఏడాది యాభై ఆకుల కట్టకు రూ 2.07 ఉండగా, ఈ యేడాది 3.01 కు పెరిగిందన్నారు, చర్చల్లో ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి అమర్లపూడి రాము, నాయకులు గోకినేపల్లి ప్రభాకర్‌రావు, కల్లూరి కిషోర్, పోతుగంటి లక్ష్మణ్, కొర్సా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నవోదయ పరీక్ష

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో శనివారం జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 189 మంది విద్యార్థులకు గాను 20 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నరసింహారావు తెలిపారు. కాగా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ ప్రవేశ పరీక్షను బీఎల్ఓ పి.కృష్ణయ్య, సీఎల్ఓ పర్యవేక్షించారు.

ఎస్వోటు జీఎంకు వినతి

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ మాట్లాడుతూ.. డయల్ యువర్ జీఎం కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. క్వారీల్లో అంతర్గత రోడ్లకు నాణ్యతతో మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు రాజలింగు, పెదనాగయ్య, కరుణాకర్, కృష్ణచైతన్య, శివకుమార్, మల్లేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

న్యాయ సహాయ కేంద్రం ప్రారంభం



మణుగూరుటౌన్: న్యాయచైతన్య సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: మండలంలోని గుట్టమల్లారం రైతు వేదికలో వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని శనివారం మణుగూరు ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైతులకు వ్యవసాయ కార్మికులకు సంబందించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల విషయంలో ఏమైన సమస్యలు ఉంటే న్యాయ సహాయ కేంద్రాన్ని ఆశ్రయించి తగిన సహాయాన్ని పొందాలని సూచించారు. చిన్నపిల్లలు, మహిళలు, ఆర్థిక స్తోమత లేనివారు ఈలీగల్ ఎయిడ్ సెల్‌ను ఆశ్రయించి తమకు సంబంధించిన క్రిమినల్, సివిల్ కేసులకు ఉచితంగా పరిష్కారం పొందవచ్చని అన్నారు. అనంతరం న్యాయవాదులు, వ్యవసాయ అధికారులు తాతారావు, లాల్‌చంద్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు సరస్వతి, సెక్రటరీ చిర్ర రవి, న్యాయవాదులు విజయ్, కవిత, సాంబ, గుట్టమల్లారం సర్పంచ్ కారం ముత్తయ్య, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ అధికారులు రాంశివరావు, వీరేంద్ర నాయుడు, లక్ష్మన్‌రావులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి రైతువేదికలో మండల వ్యవసాయ న్యాయ సహాయ కేంద్రాన్ని న్యాయవాదులు అవులూరి సత్యనారాయణ, కొండపల్లి మహేస్వరావులు శనివారం ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశానుసారం దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. రైతులకు నకిలీ పురుగుమందులు, విత్తనాల బెడద సమయంలో ఈ న్యాయ సహాయకేంద్రం వారి సహకారంతో సమ్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవికుమార్, లాయర్‌లు రాంబాబు, ప్రవీణ్, పెద్దనల్లబల్లి సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, ఏడీఏ సుధాకర్, ఏఓ నవీన్‌కుమార్, ఏఈఓ హసీనా, రైతులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ప్రొఫెసర్లు

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం పుట్ట గొడుగుల పెంపకంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక 2022–23లో భాగంగా కళాశాల ఇన్‌చార్జ్ అసోసియేషన్ డీన్ డాక్టర్ ఐవీఎస్ రెడ్డి, సమన్వయకర్త డాక్టర్ పి.శ్రీలత ఆధ్వర్యంలో రైతులకు పుట్ట గొడుగుల పెంపకం గురించి వివరించారు. పుట్ట గొడుగులలో ఉండే పోషక విలువలు, వాటి ఉపయోగాలు గురించి చెప్పారు. సూక్ష్మజీవి రహిత స్పాన్ ఉత్పత్తిలో మెళుకువలను డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి, పుట్ట గొడుగులకు వ్యాప్తించే చీడ పీడలు, యాజమాన్యం పద్ధతుల గురించి డాక్టర్ ఆర్.రెడ్డిప్రియ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ మధుసూధన్, డాక్టర్ రాం ప్రసాద్, డాక్టర్ సిద్దప్ప, అగ్రి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

అశ్వారావుపేటరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలను కేటాయించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కార్యదర్శులకు అదనపు పంచాయతీల కేటాయించిన వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేట మేజర్ పంచాయతీ కార్యదర్శికి అదనంగా మండలంలోని గుర్రాల చెరువు, తిరుమలకుంట, పాత రెడ్డిగూడెం, ఆసుపాక, నందిపాడు, ఊట్లపల్లి పంచాయతీలను కేటాయించారు. పేరాయిగూడెం కార్యదర్శికి పాత అల్లిగూడెం, అచ్యుతాపురం, మద్దికొండ, జమ్మిగూడెం, కేశప్పగూడెం, నారాయణపురం పంచాయతీలను, కన్నాయిగూడెం కార్యదర్శికి బచ్చువారిగూడెం, దిబ్బగూడెం, గుమ్మడవల్లి, కావడిగుండ్ల, కోయ రంగాపురం, మొద్దులమడ, వినాయకపురం పంచాయతీలు కేటాయించగా, వేదాంతపురం కార్యదర్శికి కొత్త మామిళ్లవారిగూడెం, రామన్నగూడెం, నారంవారిగూడెం కాలనీ, నారంవారిగూడెం పంచాయతీలు కేటాయించారు. మల్లాయిగూడెం పంచాయతీ కార్యదర్శికి అనంతారం, గాండ్లగూడెం పంచాయతీలను కేటాయిస్తూ స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.

ఆకులు తింటూ నిరసన..



అశ్వారావుపేటరూరల్: పచ్చి ఆకులు తింటూ.. నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక పాత ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణలో నిర్వహిస్తున్న సమ్మెలో వీవోఏలు ఆకులు తింటూ తమ నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు స్థానిక పంచాయతీ కార్మికుల సంఘం, తపాల ఉద్యోగులు, పవన్ కల్యాణ్ సేవా సమితి బాధ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీవోఏలు ఎస్‌కె.షాహిన్, భాగ్యలత, బుజ్జి, జయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అశ్వాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పోషకాహారం అందిస్తూ.. చిన్నారులకు ప్రీస్కూల్ విద్య అందిస్తున్నామని, ఈ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ సలోమి అన్నారు. మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపసర్పంచ్ ఎన్నా అశోక్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ శంకర్, హెచ్‌వీ.రాజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రచార కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

దమ్మపేట: మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన శ్రీరాముల వెంకటేశ్వరరావు వైఎస్సార్ తెలంగాణ పార్టీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. గ్రామస్తులు, పార్టీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగులకు ఘన సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీలో ఈపీ సీనియర్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ పదవి విరమణ పొందిన టీబీజీకేఎస్ నాయకుడు సామా శ్రీనివాస్‌రెడ్డి దంపతులను, ఈపీ సీనియర్ మెకానిక్‌గా పని చేస్తూ పదవి విరమణ పొందిన ఏఐటీయూసీ నాయకుడు నామా వెంకటేశ్వరరావు దంపతులను పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, టీవీ సుబ్బారెడ్డి, పల్లపు తిరుమలేష్, నిట్ట జీవరత్నం, బి.సురేష్, శ్వేతన్, శ్రీనివాసరావు, పి.వెంకన్న, మధుకుమార్, సాంబ, రాజేంద్రప్రసాద్, నవీన్, అశోక్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనే లక్ష్యం

అశ్వాపురం: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల వెలుగులో విద్యార్థి అమరవీరుల ఆశయ సాధనే లక్ష్యంగా తెలంగాణ జన సమితి పార్టీ ఏర్పాటైందని టీజేఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి అన్నారు. టీజేఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మొండికుంట, బీజీ కొత్తూరు గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిప్పల్ల శ్రీనివాస్, ముత్తయ్య, ఉపేందర్, శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: మే 2వ తేదీన జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగే యువజన విభాగ సమావేశాన్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్‌లు శనివారం వేర్వేరుగా యువజన నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2వ తేదీ ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు.

చిరువ్యాపారులకు రోటరీ క్లబ్ వితరణ

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా, రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో సారపాక, భద్రాచలం పరిసర ప్రాంతాలకు చెందిన చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందించారు. ఐటీసీ అనుబంధ యమరిస్ సంస్థ ఈ కార్యక్రమానికి సహాయదాతగా వ్యవహారించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు టి.సూర్యభాస్కర్‌రావు మాట్లాడుతూ.. తోపుడుబండ్లు అందించి వారి వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్, శైలేందర్ సింగ్, కునిశెట్టి రాంబాబు, విష్ణుదత్, కేవీఎస్ గోవిందరావు, సత్యనారాయణ, ప్రసాద్, మురళి, శ్రీకాంత్ రెడ్డి, అబ్దుల్‌వహీద్ తదితరులు పాల్గొన్నారు.



తోపుడుబండ్లు అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు